మోతాదు మించితే ముప్పు

- ఎరువులు అధికంగా వాడితే పంటలకు నష్టం
- భూమి నిస్సారంగా మారే అవకాశం
- చివరి దశలో రబీ వరినాట్లు
- వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే మెరుగైన ఫలితాలు


తాళ్లపూడిలో వరి పంటకు ఎరువులు జల్లుతున్న రైతు


లారీ నుంచి యూరియా బస్తాలు దింపుతున్న దృశ్యం

తాళ్లపూడి: రబీ వరి సాగులో రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. రైతులు ఎరువుల యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు. రైతులు రబీలో ముఖ్యంగా నత్రజని ఎరువు సిఫార్సు మేరకు మాత్రమే వేయాలి. లేకుంటే నష్టం తప్పదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రబీలో వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. చాలా చోట్ల నాట్లు ముగిశాయి. పలు గ్రామాల్లో రైతులు మొదటి దఫా, రెండో దఫా ఎరువులు వేస్తున్నారు.

24 వేల ఎకరాల్లో సాగు

కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల్లో సుమారు 24 వేల ఎకరాల్లో రైతులు రబీలో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో నాట్లు పూర్తికావడంతో ఎరువులు చల్లేందుకు సిద్ధమయ్యారు. రైతులు వరి పంట ఎదుగుదలకు నత్రజని, యూరియా అధికంగా వాడుతున్నారు. పలువురు రైతులు అవగాహన లేమితో మోతాదుకు మించి ఎరువులు వేయడంతో ఏటా నష్టపోతున్నారు. నత్రజని ఎరువు అధికంగా వాడడం వల్ల పంటలను చీడ పీడలు ఆశించే అవకాశం ఉంది. ఏటా రైతులు తెగుళ్లతో సస్యరక్షణ, మందులకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. గత కొన్నేళ్లుగా వరిలో ఎండాకు తెగులు అధికంగా ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇందుకు నత్రజని అధికంగా వాడడం కూడా కారణమని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అవసరానికి మించి నత్రజని ఎరువు వాడవద్దని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. మండలంలో యూరియా కొరత లేదని, రైతులు గమనించాలన్నారు. అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. వరి నాట్లు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

ఎరువులు అధికంగా వాడితే కలిగే నష్టాలు

- నత్రజని ఎరువు అధికంగా వాడడం వల్ల భూసారం దెబ్బతింటుంది.
- పంటలను తెగుళ్లు త్వరగా ఆశిస్తాయి.
- పెట్టుబడులు, నీటి వినియోగం పెరుగుతాయి.
- పంట దిగుబడి తగ్గుతుంది.
- పంట నాణ్యత కోల్పోతుంది.
- పంట త్వరగా ఎదిగిపోయి గాలికి పడిపోతుంది.
- వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- ఎండాకు తెగులు వచ్చే అవకాశం ఎక్కువ.

ప్రస్తుతం యూరియా కొరత లేదని అధికారులు చెబుతున్నారు. రైతులు విచక్షణా రహితంగా ఎరువులు వేయరాదని, అధికారుల సిఫార్సు మేరకు మాత్రమే ఎరువులు వేయాలని సూచిస్తున్నారు.

వేప పిండితో కలిపి వేయాలి



వరి పంటకు నత్రజని ఎరువు (యూరియా) 72 కేజీలను మూడు సమభాగాలుగా విభజించి 26 కేజీల చొప్పున వేయాలి. సూపర్ సింగిల్ ఫాస్ఫేట్ ఎకరాకు 150 కేజీలు చివరి దమ్ములో వేయాలి. పొటాష్ 40 కేజీలు రెండు దఫాలుగా వేయాలి. కాంప్లెక్స్ (భాస్వరం) ఎరువులు పైపాటుగా అసలు వేయవద్దు. యూరియా వేప పిండితో కలిపి వేయాలి. ఇలా చేస్తే ఎరువు వృథా కాకుండా మొక్కకు సక్రమంగా అందుతుంది. యూరియా వేసే ముందు నీటిని తీసివేయాలి. బురద పదునులో ఎరువు వేసి 48 గంటల తరువాత నీటిని పెట్టాలి.

– జి.రుచిత, మండల వ్యవసాయాధికారి, తాళ్లపూడి

క్లుప్తంగా

దుకాణాలు 2.. దరఖాస్తులు 82

దేవరపల్లి: గీత కార్మికులకు దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తు స్వీకరణ గడువు శనివారం ముగిసింది. దేవరపల్లి మండలంలో ఒక దుకాణానికి 39, గోపాలపురంలో ఒక దుకాణానికి 43 కలిపి మొత్తం 82 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దరఖాస్తులను పరిశీలించలేదని, కోడ్ ముగిసిన అనంతరం పరిశీలించి, లాటరీ తీస్తామని చెప్పారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: తణుకు సితార హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో సుంకవల్లి ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సితార హాస్పిటల్ డాక్టర్ నీలు మహేంద్ర (ఎండీ), ప్రముఖ కంటి వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ క్యాంప్‌లో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆకెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో స్వయంభుగా వెలసిన ఉమా అక్షయ రామలింగేశ్వరస్వామి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గత రెండు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక హోమాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చౌడేశ్వరస్వామికి విశేష పూజలు


కొవ్వూరులో ఉమాచౌడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలోని పాతూరులో వేంచేసిన ఉమా చౌడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పండితులు గణపతి పూజ, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన చిరవూరి సుబ్రహ్మణ్యం, రమా సత్యశైలజ దంపతులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు కేతవరపు భాను, దేవరకొండ సాయి ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏడిద వీర వెంకట సత్యనారాయణమూర్తి, కలిగోట్ల కృష్ణారావు, వైవీ కామేశ్వరరావు, చిరవూరి వెంకట సత్య సోమయాజులు, ఇనగంటి ఉమా రామారావు,తెన్నేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


వడ్లూరులో అగ్నిప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: మండలంలో వడ్లూరులో షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల ఇల్లు దగ్ధమైంది. బాధితుడు సాధనాల రామకృష్ణను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరామర్శించి, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి సిద్ధార్థరాజు, రఘుమండ శ్రీను, వేంద్ర రమేష్, మల్లుల సత్యనారాయణ, వి.నాగరాజు, బయ్యే సత్తిపండు, ఆబోతు ముత్యాలరావు, రాపాక కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురురిపై కేసు

కొవ్వూరు: పట్టణంలోని విజయవిహార్ హోటల్‌లో ఆదివారం రాత్రి గొడవపడి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు.

టిఫిన్ ఆర్డర్ ఇస్తే త్వరగా రాకపోవడంతో తనను దుర్భాషలాడి, గొడవకు దిగినట్లు హోటల్‌లో పని చేస్తున్న గిరుటూరు దుర్గామల్లేశ్వరి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన విస్సాకోటి మోహర్ చైతన్య, పాశం రవిశంకర్, జొన్నకూటి రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వీరరాఘవులును గెలిపించండి

నిడదవోలు: పీడీఎఫ్ ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న దిడ్ల వీర రాఘవులు ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చడానికి అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువత మేధావులు ఆలోచించి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు.

పేరాబత్తులను గెలిపించండి

నిడదవోలు: కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 23వ వార్డులో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

నిడదవోలు: ఆర్టీసీ బస్టాండ్ రోడ్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గణేష్‌చౌక్ ప్రధాన రోడ్డుకు దగ్గరలో కుమ్మర వీధిలో ఉన్న కనక మహాలక్ష్మీ కోఆపరేటివ్ భవనం వెనక ఉన్న భవనంలోకి మార్పు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ ఎం.రాజబాబు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ఆర్వోబీ మూడో ఆర్మ్ నిర్మాణ పనుల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయాన్ని తరలించామన్నారు. సోమవారం నుంచి మార్పు చేసిన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి పని వేళలు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ దుర్గారావు ఆదేశం


దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: వేసవి మంచినీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందించాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వేసవితో విద్యుత్ కోతలు లేకుండా, ఇప్పటి నుంచి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొల్పాలని అధికారులకు సూచించారు. స్థానిక జగనన్న కాలనీలో బోర్లు వేసి ఆరు నెలలైనా, ఇంత వరకు విద్యుత్ సర్వీసులు ఇవ్వలేదన్నారు. సర్వీస్ సొమ్ము వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. యాదవోలు రోడ్డులో మంచినీటి బోరు విద్యుత్ సర్వీసుకు అవసరమైన నిధులు మండల పరిషత్ నుంచి ఇచ్చేలా తీర్మానించినందున, వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ, ఉపాధి హామీ, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ తదితర శాఖల పనితీరుపై చర్చించారు. ఏపీఈపీడీసీఎల్ ఏఈ సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ, వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా గ్రామాల్లోని మంచినీటి బోర్లుకు టౌన్ ఫీడర్ 11 కేవీ లైన్ ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్టు తెలిపారు. దేవరపల్లి, గౌరీపట్నం, దుద్దుకూరులో 30 ట్రాన్స్‌ఫార్మర్లు, లక్ష్మీపురం, బందపురం, రంగరాయకాలనీలో 11 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు. ఏప్రిల్ నాటికి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. 11 కేవీ లైన్ల కింద కాలనీల్లో ఇళ్లు నిర్మించడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, అక్కడ ఇళ్లు కట్టవద్దని సూచించారు. పంచాయతీ బోర్ల వద్ద రక్షణ లేదని, కనీసం ఫ్యూజ్ క్యారియర్లు, బోర్డులు లేవని, వెంటనే రక్షణ ఏర్పాటు చేయాలన్నారు.

ప్రతి మంచినీటి బోరు వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గొల్లగూడెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. పల్లంట్ల సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పల్లంట్ల–లక్ష్మీపురానికి రెండో టౌన్ ఫీడర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పల్లంట్లకు కూడా టౌన్‌ఫీడర్ ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ, చిన్నాయగూడెంలో భూముల రీసర్వే జరుగుతుందన్నారు. గతంలో రీసర్వేకు రైతుల నుంచి 800 అభ్యంతరాలు రాగా, 500 పరిష్కరించినట్టు తెలిపారు. వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పీఆర్ ఏఈ వినోద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య


సిబ్బందితో సమీక్షిస్తున్న వ్యవసాయాధికారి కమల్‌రాజ్

నల్లజర్ల: భూమిగల ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరమవుతాయని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ వివరించారు. రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత భూమిగల ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని అన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర సబ్సిడీలు, సేవలు రైతులు పొందవచ్చునన్నారు. పీఎం కిసాన్ చెల్లిరపు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై సూక్ష్మ సేద్య పథకాలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలుంటుందన్నారు. ఆధార్ నంబరు, ఆధార్ నంబరుతో అనుసంధానమైన ఫోన్ నంబరు, భూమి రికార్డు (పట్టాదారు పాస్‌బుక్) జెరాక్స్ తీసుకొని గ్రామ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా ఇస్కాన్ వార్షికోత్సవం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఇస్కాన్ ప్రతినిధి సత్యగోపి ప్రభూజీ

తాళ్లపూడి: శ్రీమహావిష్ణువు భక్తుల గురించి తెలుసుకునేందుకు భూమి మీదకు వచ్చిన సంకల్ప అవతారమే శ్రీకృష్ణ చైతన్య రూపమని రాజమహేంద్రవరం ఇస్కాన్ ప్రతినిధి సత్యగోపి ప్రభూజీ అన్నారు.

తాళ్లపూడిలోని రుక్మిణి సత్యభామా సమేత మదనగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం ఇస్కాన్ 5వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరే రామ, హరే కృష్ణ మంత్ర జపంతో జీవన యాత్ర సాగించాలని సూచించారు. కార్యక్రమంలో శివానంద్‌ప్రభు, సింహాద్రి జనార్దనరావు, హరే కృష్ణ టీమ్ సభ్యులు గర్రే సురేష్, చెరుకూరి బంగారు బాబు, చెన్నా గోపాలకృష్ణ, కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలుపుదల


సింగరాజుపాలెం ఊరచెరువులో అక్రమ కట్టడాన్ని నిలుపు చేస్తున్న ఎంపీడీఓ సింహాద్రి, పోలీసులు

నల్లజర్ల: మండలంలోని సింగరాజుపాలెం ఊరచెరువు ఒడ్డున శ్మశాన వాటికకు సంబంధించి నిర్మిస్తున్న (షెడ్డు) అక్రమ నిర్మాణాన్ని ఎంపీడీఓ సింహాద్రి, ఎస్‌ఐ బాలాజీ, ఏఎస్‌ఐ మనెల్లి మోహన్ ఆదివారం నిలుపు చేశారు. ఈ చెరువు ఒడ్డున ఎటువంటి కట్టడాలు చేయవద్దంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇదే గ్రామానికి చెందిన కోఠారు ప్రదీప్ చక్రవర్తి, కామిరెడ్డి కృష్ణవేణిలు ఈనెల 6వ తేదీన కొవ్వూరు ఆర్డీఓ, జిల్లా పంచాయతీ అధికారి, తహసీల్దారుకు దీనిపై ఫిర్యాదు చేశారు.

ఊరచెరువు గట్టున ఇటువంటి నిర్మాణాలు చేపట్టడం వల్ల చెరువు విస్తీర్ణం 50 ఎకరాల నుంచి 23 ఎకరాలకు కుచించుకు పోయిందని, తద్వారా భూగర్భ జలాలు అడుగంటి గొట్టపు బావులకు నీరందకుండా పోతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే చెరువు పక్క 200 మీటర్ల రహదారి సైతం నిర్మించారన్నారు. ఇలా కట్టడాలు నిర్మించుకుంటూ పోతే భవిష్యత్తు తరాలకు నీరులేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ నిలుపుదల చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

కొవ్వూరు: వాడపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందెల శిబిరంపై ఆదివారం పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.16,850 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ వాయిదా

నిడదవోలు: రాజమహేంద్రవరంలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 10న సోమవారం నిర్వహించాల్సిన గీత కార్మికులకు కేటాయించబడిన మద్యం దుకాణాలకు సంబంధించి లాటరీ ప్రక్రియను వాయిదా వేసినట్లు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతితో లాటరీ ప్రక్రియ ఎప్పుడు ఉంటుందో తెలియజేస్తామని ఆయన స్పష్టం చేశారు. నిడదవోలు మండలంలో గౌడ కులస్తులకు కేటాయించిన మద్యం దుకాణానికి 48 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా పెరవలి మండలంలో శెట్టిబలిజ కులానికి సంబంధించిన మద్యం దుకాణానికి 39 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఉండ్రాజవరం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ సోమవారం ఆల్బెండజోల్ నులి పురుగు మాత్రలు పంపిణీ చేస్తారని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. అంగన్వాడీ పిల్లలకు, పాఠశాలలో విద్యార్థులకు స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పకుండా తీసుకునే విధంగా సహకరించాలని కోరారు.

సేంద్రియం వైపు.. అందరి చూపు

- కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు
- ఇంట్లోనే తయారు చేస్తున్న మహిళలు
- ఇంటి పెరట్లో కూరగాయల సాగు
- అదనంగా ఆదాయం సమకూర్చుకుంటున్న అతివలు


సేకరించిన ఎరువులను పరిశీలిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్


ఖాళీ ప్రదేశంలో పండించిన ఆకుకూరలు


సేంద్రియ ఎరువు తయారీలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

సీటీఆర్ఐ: ప్రస్తుతం నాణ్యమైన కూరగాయలు దొరకడం చాలా కష్టంగా మారింది. మార్కెట్‌లో లభ్యమైవుతున్న కూరగాయలను ఎరువులు వినియోగించి పండిస్తున్నారు. దానివల్ల వాటిలో నాణ్యత తక్కువగా ఉంటోంది. ఎక్కువ ధర చెల్లించడానికి సిద్ధమైనా మంచివి లభించని పరిస్థితి. ఈ నేపథ్యంలో చాలా మంది తమ ఇళ్లపై, పెరట్లో కూరగాయలను పెంచుతున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని చాలా శ్రద్ధగా చూస్తున్నారు. వాటిని ఎంత జాగ్రత్తగా పెంచినా ఎరువులు చేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయాల వ్యర్థాలతో మంచి ఎరువు తయారు చేసేలా శిక్షణ ఇచ్చింది. దీనివల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకోవచ్చు. వ్యాపారం చేయాలంటే ముందుగా కొంత పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది. తీరా పెట్టిన తరువాత ఆ డబ్బు తిరిగి వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. అందుకే పెట్టుబడి లేని ఆదాయం కోసం మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డెనింగ్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని సొంతానికి వినియోగించుకుని, మిగిలిన వాటిని ఇతరులకు విక్రయించి ఆదాయం సంపాదిస్తున్నారు. కూరగాయలు పండించడానికి సేంద్రియ ఎరువులు అవసరమవుతాయి. వీటిని కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయవలసి వస్తుంది. దీని కోసం కార్పొరేషన్ వినూత్నంగా ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంటిలో వ్యర్థ పదార్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకునే విధంగా మహిళలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. శిక్షణ పొందిన మహిళలు ఇంటిలోనే హోమ్ కంపోస్టును తయారు చేసుకుంటున్నారు. వీటిని సొంతానికి వాడుకోగా, మిగిలిన వాటిని నర్సరీలకు, కూరగాయలు పండించే వారికి విక్రయించి ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

కూరగాయల పెంపకం... తద్వారా ఆదాయం

ప్రతి ఒక్కరూ ఇప్పుడు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంటిలో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ మొక్కలు నాటుతున్నారు. అంతే కాకుండా గార్డెనింగ్‌లోనూ, డాబాపైన పూలు, కూరగాయల మొక్కలు వంటివి పెంచుతున్నారు. మహిళలు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయిస్తున్నారు.

తయారీ విధానం

కూరగాయల వ్యర్థాలను, మిగిలిపోయిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో లేదా ప్లాస్టిక్ బకెట్‌లో వేసుకోవాలి. బకెట్ అడుగున ఒక రంధ్రం చేయాలి. దీని ద్వారా చెత్తలోని తేమ బయటికి పోతుంది. ఇలా రోజూ ఇంటిలో మిగిలిన తడి చెత్తను ఆ కుండ/బిన్‌లో వేసుకోవాలి. కుండ, బిన్ చుట్టూ కారం, పసుపు చల్లాలి. దీని వల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. ఒక నెల రోజులలోనే కంపోస్ట్ తయారవుతుంది.

మహిళలకు శిక్షణ

ఎవరికి వారే తయారు చేసుకునే విధంగా నగర పరిధిలోని సుమారు 5 వేల కుటుంబాలను సెలెక్ట్ చేసి వారికి వీటి తయారీ విధానంలో శిక్షణనిచ్చారు. దీనితో 5 వేల కుటుంబాల వారు సేంద్రియ ఎరువును తయారు చేసుకుని వాటిని వారి సొంతానికి వాడుకుంటున్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల మంచి దిగుబడి

సేంద్రియ ఎరువుల తయారు చేసుకుని వాటిని పెరటి మొక్కలకు వాడటం వల్ల మంచి దిగుబడి వస్తుంది. మహిళలు తమ ఇంటి పరిసరాల్లో తయారు చేసుకున్న సేంద్రియ ఎరువులను ఇంటి పెరటిలో పెంచుతున్న మొక్కలకు వాడుతున్నారు. దీని వల్ల దిగుబడి పెరుగుతుంది. కూరగాయలు అధిక ధరలుండటం వల్ల ఇంటిలో పెంచుకున్న కూరగాయల వల్ల లాభం చేకూరుతుంది. తయారు చేసుకునే విధానం చాలా సులువుగా ఉండటంతో మహిళలు పెద్ద శ్రమ లేకుండా వీటిని ఇంటిలోనే తయారు చేసుకోవచ్చు.

– శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్, కార్పొరేషన్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com